సూర్య
నేటి దినపత్రిక
18వ సంవత్సరం
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
గురువారం,17 ఏప్రిల్ 2025
8 పేజీలు

## ఒకే కుటుంబంలో ముగ్గురికి గిన్నిస్ రికార్డ్



**నరసాపురం రూరల్,మేజర్‌న్యూస్:** మండలంలోని రుస్తుంబాధ పంచాయతీకి చెందిన లూసీ చారిటబుల్ ట్రస్ట్అధ్యక్షులు. పాస్టర్ మామిడిశెట్టి యెషయా, ప్రశాంతి దంపతులరెండవ కుమారుడు. మామిడిశెట్టి రాజేష్, పరిమళ జ్యోతి,కుమారుడు హనోక్‌జోష్.ఒకే కుటుంబానికి చెందిన వీరు ముగ్గురు గిన్నిస్ వరల్డ్‌రికార్డ్ సాధించారు.

విజయవాడకు చెందినహలల్ మ్యూజిక్ స్కూల్ తరఫున కీబోర్డు ప్లే చేసి ఒకేసారి 1046 మంది 18దేశాల నుండి ఒకగంట వ్యవధిలో ఒకేసారి ఇనస్టాగ్రామ్‌లో అప్లోడ్ చేయడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ వారు గుర్తించి 1046 మందికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం కల్పించారు. ఒకే కుటుంబంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించడం ద్వారా కుటుంబ సభ్యులతో పాటు గ్రామసర్పంచ్ బందెల భారతి పలువురు నాయకులు అభినందిస్తున్నారు.

# కొల్లేరు ప్రజలకు ఊరట

### ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అవిరళ కృషి
### మంత్రి సత్య కుమార్ యాదవ్ సహకారం



**కైకలూరు,మేజర్‌న్యూస్:** కొల్లేరుపై బుధవారం సుప్రీంకోర్టు విచారణలో నేషనల్ ట్రిబ్యునల్ బోర్డు సలహాలు అనుసరిస్తూ జిరాయితీ రైతులు, కొల్లేరు ప్రజల హక్కులు స్థితిగతులను తీసుకుంటూ జిల్లా కలెక్టర్ ద్వారా 12 వారాల లోపు కొల్లేరుపై నివేదికతీసుకోవాలని సీఈసీ కమిటీని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో కొల్లేరు ప్రజలకు ఊరట లభించింది.1999వ సంవత్సరం నుండి ఇప్పటివరకు ఎవరు కూడా ఇంప్లిడ్ పిటీషన్ వేయలేదు గత రెండు రోజులుగా కొల్లేరు విషయంపై ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సారథ్యంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్, ఉంగుటూరు శాసనసభ్యులు పి.ధర్మరాజు,కొల్లేరు సంఘ నాయకులతో కలిసి - తరువాయి 2లో..

## నా ఇంటికి వచ్చి నన్ను టచ్ చేసి చూడు..!



### మాజీమంత్రి కారుమూరిపై ఘాటుగా స్పందించిన ప్రభుత్వ విప్ బొలిశెట్టి

**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** ఏరక్షణ సిబ్బంది లేకుండా నేను ఒంటరిగా ఉంటాను.నా ఇంటికి వచ్చి నన్ను టచ్ చేసి చూడు నా దమ్మేంటో తెలుస్తుందని ఘాటుగా మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు రాష్ట్ర విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఘాటుగా జవాబు ఇచ్చారు.కూటమి కార్యకర్తలపై ఇటీవల కారుమూరి చేసినవ్యాఖ్యలకు స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రజలకు పెద్దన్న పాత్ర పోషించాలని, ప్రజలతోమమేకమైఉండాలని,ప్రజలకు అందుబాటులో ఉండాలన్న మాటలను వక్రీకరించి - తరువాయి 2లో..

## రహదారుల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు





### - ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి
### - ఎమ్మెల్యే చింతమనేనితో కలిసి పలు కార్యక్రమల్లో పాల్గొన్న ఎంపీ

**దెందులూరు,మేజర్‌న్యూస్:**పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేంద్రంనుంచి రాబడతానని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ స్పష్టంచేశారు.దెందులూరు మండలం సోమవరప్పాడులో రూ.74 లక్షలతో - తరువాయి 2లో..

### మే 7 నుండి బ్రహ్మాండనాయకుని
## బ్రహ్మోత్సవాలు





**ద్వారకా తిరుమల,మేనేజర్ న్యుస్:** రాష్ట్రంలోనే ప్రముఖ దేవాలయాల్లో ఒకటిగా జిల్లాలోనే ప్రఖ్యాతి గాంచినగా ద్వారకా తిరుమల చిన్న వెంకన్న ఆలయం విరాజిల్లుతుంది. నిత్యం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించి తరిస్తున్నారు.భక్తులకు తగినట్లుగా ఆలయ దినదినాభివృద్ధి చెందుతుంది. వైఖానస ఆగమం అనుసరించి దీక్షతో స్వామివారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా రెండుసార్లు ఇక్కడ సాంప్రదాయంగా వస్తుంది.ఈ క్రమంలోనే మేనెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు స్వామి వారి వైశాఖమాస తిరుకళ్యాణ మహోత్సవములు జరుగుతున్నా యని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎన్‌విఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. ఉత్సవాలు స్వామివారి కల్యాణము 11వ తేదీ ఆదివారం రాత్రి 8 గంటలకు,స్వామివారి రథోత్సవము 12వ తేదీ - తరువాయి 2లో..

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన నూజివీడు వాసి



**నూజివీడు,మేజర్‌న్యూస్ :** మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన జంగా జాన్ వెస్లీ సంగీతంలో గిన్నిస్ బుక్ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించారు. విజయవాడ హెూలేల్ మ్యూజిక్ స్కూల్ ద్వారా గత ఏడాది డిసెంబర్‌లోనిర్వహించిన ప్రపంచ స్థాయి ఆన్లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో పాల్గొన్నారు. కీబోర్డు వాయిస్తున్న సంగీత కళాకారుల బృందంతో గంటలో 1046 వీడియోలు అప్లోడ్ చేశారు. నిర్వాహకులు జంగా జాన్‌వెస్లీ ప్రావీణ్యతను గుర్తించి హైదరాబాద్ మణికొండలో ఉన్న ద లైఫ్ చర్చిలో ఈనెల 14న జరిగిన గిన్నిస్ బుక్ఆఫ్ వరల్డ్‌రికార్డ్ సర్టిఫికెట్ కార్యక్రమంలో హెూలేల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ పాస్టర్ ఆగస్టీన్(దండంగి. వేణుగోపాల్) చేతుల మీదుగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికేట్ అందజేయగా, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంస్థ ప్రతినిధులు శ్రీ ఆనంద్ రాజన్ చేతుల మీదుగా మెడల్ అందుకున్నారు.

## వాహనం ఢీకొని ఇద్దరు ఉపాధి కూలీల మృతి

### సంఘటన స్థలానికి చేరుకున్న జిల్లా కలెక్టర్, ప్రభుత్వ విప్
### ఉపాధి కూలీల మరణం ఎంతో బాధాకరం
### జిల్లా కలెక్టర్ నాగరాణి, ప్రభుత్వ విప్ నాయకర్








**మొగల్తూరు,మేజర్‌న్యూస్:**బుధవారం ఉదయం సుమారు 8.00గంటల సమయంలో మొగల్తూరు హైవే పక్కన నల్లవారి తోట ప్రాంతంలోని పంట బోదు పూడిక తీత పనులను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో అకస్మాత్తుగా మినీ వ్యాన్ దూసుకువచ్చి ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు మృతి చెందారు.మొగల్తూరు మండలం నక్కవారి పాలెంకు చెందిన కడలి పావని (40), గుబ్బల గంగాదేవి (50)లు మృతి చెందగా, గుబ్బల మాణిక్యరావు (56), గుడాల సత్యనారాయణ (45)క్షతగాత్రులు అయ్యారు. విషయం తెలుసుకున్న - తరువాయి 2లో..

# రహదారుల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు

**మొదటిపేజి తరువాయి**

నిర్మించిన బీటీ రోడ్డు, సిమెంటు రోడ్డును,ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు సోమవరప్పాడు ప్రధాన కూడలి వద్ద మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారకరామారావు విగ్రహానికి ఎంపీ మహేష్ ,ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ గ్రామంలో రహదారి అభివృద్ధికి కృషి చేసిన ఎంపీ,ఎమ్మెల్యేకు సోమవారప్పాడు ప్రజలు ఘన స్వాగతం పలికారు.అనంతరం పెదవేగి మండలం గోపన్నపాలెం నుండి రామసింగవరం వరకు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మీడియాతో మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గం పరిధిలోని సమస్యలను తాను, ఎమ్మెల్యే ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి అంటేనే ఎమ్మెల్యే చింతమనేని అని, ప్రజలకు తన వంతు సేవలు అందిస్తున్నారని ఎంపీ పేర్కొన్నారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని విస్మరించడంతో ఐదేళ్లపాటు ప్రజలు నరకం చవి చూశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టిందని, ఫలితంగానే పల్లెల నుంచి పట్టణాల వరకు రహదారులు నూతన శోభను సంతరించు కుంటున్నాయని ఎంపీ వెల్లడించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ సోమవరప్పాడు రహదారిని రూ.74 లక్షలతో అభివృద్ధి చేయటం జరిగిందని,గోపన్నపాలెం నుంచి రామసింగవరం వరకు రూ.3 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.ఎంపీ మహేష్ కుమార్ సహకారంతో దెందులూరు నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రభాకర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత,నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పొగాకు బేరన్ దగ్ధం : రూ.2లక్షల నష్టం



**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** పొగాకు బేరన్ దగ్ధమై సుమారు రూ.2లక్షల నష్టం వాటిలినట్లు జంగారెడ్డిగూడెం ఫైర్ ఆఫీసర్ జి అబ్రహం తెలిపారు. మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో ఆలపాటి వెంకట రమణ రాజుకు చెందిన పొగాకు బేరన్ ప్రమాదవశత్తు దగ్ధమై ందని రాత్రి 7 గంటలకు సమా చారం రావడంతో తన సిబ్బందిని తీసుకొని హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసినట్లు ఆయన తెలియజేశారు. 6 క్వింటాళ్ల పొగాకు దగ్ధమైందని వీటి విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని ఆయన చెప్పారు. పార్థసారథి, బాబురావు, గంగరాజు తదితర సిబ్బంది పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

## అస్తిపంజరమైన స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** వ్యక్తి మృతదేహం అస్తిపంజరమై న స్థితిలో పోలీసులకు లభించిన ఘటన ఏలూరు నగరంలో జరిగింది. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇందిరమ్మ కాలనీ వద్ద బుధవారం సాయంత్రం మృతదేహం లభించింది. అయితే పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం మృతుడు వేమూరి సత్యనారాయణ (65)గా గుర్తించారు. ఈయన సతీమణి విజయవాడలో ఉన్న తన కుమారుడి వద్ద ఉంటుందని సత్యనారాయణ ఒంటరిగా కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో ఉంటున్నాడని తెలుస్తుంది. మద్యానికి బానిసైన ఆయన కింద పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

## ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమైన క్షణం



ఏలూరు,మేజర్ న్యూస్ : 2025 ఇండియా జస్టిస్ డెలివరీ ఇండెక్స్‌లో మనం 2వ స్థానానికి చేరుకున్నామని 2022లో 5వ స్థానం నుండి ఇది గణనీయమైన పురోగతి రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.ఈ మైలురాయి అందరికీ సమర్థవంతమైన, సమ్మిళితమైన, అందుబాటులో ఉండే న్యాయం పట్ల ప్రభుత్వ అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారుఇందుకు ముఖ్యమంత్రికి అభినందనలు అని, నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వం, సుపరిపాలన పాలన పట్ల అంకితభావానికి ధన్యవాదాలు తెలుపుతున్నానని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

## జిల్లాలో తాగునీటి సమస్యపై సమీక్ష

**– తక్షణమే బోర్లు మంజూరు చేయాలి : జెడ్పి చైర్‌పర్సన్ పద్మశ్రీ**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు జిల్లాలో వేసవి కాలంలో తాగునీటి కొరత సమస్యను ఎదుర్కొంటున్న గ్రామాల పరిస్థితి, పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈతో బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. త్రాగునీటి సమస్య తలెత్తే ప్రాంతాలను గుర్తించి, అవి ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ త్రినాధ్ బాబును చైర్ పర్సన్ ఆదేశించారు. ఆర్ డబ్ల్యూ ఎస్ఎస్ఈ త్రినాధ్ బాబు మాట్లాడుతూ చెట్టున్నపాడు, అగడాలలంక, మల్లవరం గ్రామాలకు తాగునీటి సమస్యను పరిష్కరించామని చెప్పారు. ప్రధానంగా పోలవరం ప్రాజెక్ట్ పునరావాస కాలనీలు, అలాగే జిల్లాలోని వర్షాభావ ప్రాంతాలు వేసవి కాలంలో తీవ్ర నీటి కొరతకు గురవుతున్న ప్రాంతాలుగా గుర్తించామని,ఆయా ప్రాంతాలలో త్రాగునీటి పరిష్కారానికి తక్షణం కొత్త బోర్లు తవ్వించాల్సిన అవసరం ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌కి త్రినాధ్ బాబు నివేదించగా,ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎస్ఈ ని చైర్ పర్సన్ ఆదేశించారు.

# మహిళలకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలి

**– ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ**



**యలమంచిలి,మేజర్ న్యూస్ :** ప్రభుత్వం మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ డిమాండ్ చేశారు, ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా వ్యాప్త సామాజిక చైతన్య యాత్ర మూడవరోజైన బుధవారం యలమంచిలి మండలం చించినాడ గ్రామంలోకి ప్రవేశించింది,

ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ సమాజంలోని పేద బడుగు వర్గాల జీవన ప్రమాణాన్ని పెంచాల్సిన ప్రభుత్వాలు అవేవీ వారికి పట్టనట్లు వ్యవహరిస్తూ కేంద్ర ప్రభుత్వం తరుపున ఎంపీలకు, రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఎమ్మెల్యేలకు ఇష్టానుసారం జీతాలు పెంచుకున్నారని కానీ కనీసం మహిళలకు సరైన ఉపాధి అవకాశాలు కూడా చూపు లేకపోతున్నారని విమర్శించారు,, ఐద్వా జిల్లా కోశాధికారి సరిపల్లి జయప్రభ మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో హామీలు ఇచ్చారని వాడిన అమలపరచకుండా ప్రజలను ఏ మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఎప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనియెడల మహిళలందరినీ సంఘటితం చేసి పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి జిల్లెల్ల ప్రశాంతి, జయశ్రీ, నాగమణి,ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కొల్లేరు ప్రజలకు ఊరట

**మొదటిపేజి తరువాయి**

ఢిల్లీలో పర్యటన చేసి కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను వివరించి హామీ తీసుకోవడం జరిగింది.కొల్లేరుపై ఎంతమంది ఎన్ని విష ప్రచారాలు చేసినా ఎక్కడా తలొగ్గకుండా ఎన్నికలలో ఇచ్చిన మాటకు కట్టుబడి కొల్లేరు ప్రజల కోసం పోరాడుతున్నఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను పలువురు అభినందిస్తున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాటల మనిషి కాదని ఇచ్చిన మాట కోసం ఎక్కడికైనా వెళ్లి ఏ పనైనా సాధించుకు రాగల వ్యక్తి అని ఈ విషయంతో తేటతెల్లమయిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్ (బాబీ),బలే ఏసురాజు,తాడినాడ బాబు, నంబూరీ శివాజీరాజు, వాసురాజు, చింతలమూడి శ్రీకాంత్, జయమంగళ సుబ్బరాజులు పాల్గొన్నారు .

## నా ఇంటికి వచ్చి నన్ను టచ్ చేసి చూడు..!

**మొదటిపేజి తరువాయి**

కారుమూరి అనుచిత వ్యాఖ్యలు చేయడం వారి రావణ పాలనకు నిదర్శనమని తెలిపారు. ఐదు సంవత్సరాలు గా ఎదురు మాట్లాడిన వారిపై కేసులు పెట్టడం,ఆర్థిక ఇబ్బందులకు గురి చేయడం వంటి అనేక నేర కార్యక్రమాలు చేయడం తప్ప రాష్ట్ర అభివృద్ధి శూన్యమని తెలిపారు.రాబోవు 10 సంవత్సరాలు పాటు కూటమి ప్రభుత్వం ఖాయమని ఆయన గుర్తు చేశారు. వైసిపి కార్యకర్తలను ఉత్తేజ పరచడం కోసం అనుచిత వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని బొలిశెట్టి హెచ్చరించారు.

## మే 7 నుండి బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలు

**మొదటిపేజి తరువాయి**

సాయంత్రం 7 గంటల 30 నిమిషాలకు జరుపబడుచున్నందున విద్యార్థి కల్యాణములు,అన్ని అద్భుత సేవలు జరుపడవని ఈవో మూర్తి తెలిపారు. క్షేత్ర పురాణ కథ ఇది ద్వారకా మహర్షి తపో ఫలితంగా ఉద్భవించిన ఈ క్షేత్రం తిరుమలగా పిలువబడు తుంది.ఎక్కడ స్వయం వ్యక్తిగా కొలువైన చిన్న వెంకన్న పుట్టలో విడిచారు.దీంతో స్వామివారి పాదుకలు ఫోటోలో ఉండడంతో శ్రీవారికి పాదపూజ లేదు అందుచేత పెద్ద తిరుపతి నుంచి స్వామివారిని తెచ్చి స్వయం వ్యక్తిని వెనక ప్రతిష్టించారు. దీంతో ఓకే అంతరాలయంలో స్వామి ఇద్దరు మూర్తులుగా కొలువై ఉండటం వల్ల ఏటా వైశాఖ,ఆశ్వయుజ, మాసాలలో కల్యాణ మహోత్సవాలు జరుగుతాయి. తిరుమల తిరుపతి స్వామి వారు ఇక్కడ ఉన్నారు. కనుక శ్రీవారికి భక్తులు ఇక్కడ తీర్చుకునే సంప్రదాయం ఉంది కానీ ఇక్కడ మాత్రం పెద్ద తిరుపతి లో తీసుకోకూడదు పెద్ద వెంకన్న ఉన్న తిరుమల తిరుపతి ఎగువ తిరుపతి అని చిన్న వెంకన్న ఉన్న ద్వారకాతిరుమల చిన్న తిరుపతి అని పిలుస్తారు.

## వాహనం ఢీకొని ఇద్దరు ఉపాధి కూలీల మృతి

**మొదటిపేజి తరువాయి**

జిల్లాకలెక్టర్ చదలవాడనాగరాణి,రాష్ట్రప్రభుత్వ విప్ బొమ్మిడినాయకర్ హుటాహుటిన సంఘ సంఘటనా స్థలానికి చేరుతున్నారు. ఉపాధి కూలీలు మరణించడం ఎంతో బాధాకరమని వారన్నారు. అనంతరం, నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాలనుచూసి,క్షతగాత్రులను పరా మర్శించి, బాధిత కుటుంబాలను ఓదార్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, చనిపోయిన వారికి వెంటనే పోస్టుమార్టం పూర్తిచేసి కుటుంబసభ్యులు అందజేయాలని ఆదేశించారు. మృతులకు, క్షత గాత్రులకు ప్రభుత్వపరంగా పరిహారం అందించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే డీఎస్పీ శ్రీ వేద సిబ్బందితో కలిసి వెళ్లి సహాయక చర్యలో పాల్గొన్నారు. ఆర్డీవో దాసిరాజు, తహసిల్దార్ ఐవివి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## 19న బుద్ధా పార్క్ వద్ద స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమమును ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గం.లకు స్థానిక బుద్ధా పార్క్ సెంటర్ లో జరుగుతుంది. ఇ- వేస్ట్ ,ఆరోగ్యం పర్యావరణంలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయంగా పారవేయుట గురించి ప్రజలకు అవగాహన కల్పించు కార్యక్రమం ఏర్పాటు చేశారని నగరపాలక సంస్థ కమీషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు.

కార్యక్రమంనకు జిల్లా కలెక్టర్,శాసన సభ్యులు, నగర మేయర్, జిల్లా అధికారులు, నగరపాలక సిబ్బంది,ఎస్‌హెచ్‌జి సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

# ఏలూరు - విజయవాడ నాన్ స్టాప్ కొత్త అల్ట్రా డీలక్స్ ప్రారంభం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు – విజయవాడ నాన్ స్టాప్ కొత్త అల్ట్రా డీలక్స్ సర్వీస్‌ను బుధవారం జెండా ఊపి ప్రారంభించిన శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి),ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్,నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దాదాపు 12 కొత్త సర్వీసుల్ని కాకుండా అనేక కొత్త బస్సుల్ని ప్రారంభించడం జరిగిందని,ప్రతినిత్యం మా వద్దకు వచ్చే అనేకమంది ప్రజల విన్నపాలు మేరకు కొత్త బస్సులు ప్రారంభించడం జరుగుతుందని ప్రజలకు సరికొత్త బస్సులు,సరికొత్త రూట్లలో,మరిన్ని బస్సులు ఏర్పాటు చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని జోనల్ చైర్మన్ లని ఏర్పరిచిన తర్వాత ఆర్టీసీ సర్వీసులను మరింత మెరుగుపరిచి మంచి సేవలు అందిస్తున్నామని వివరించారు. రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి తాను జోనల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జోన్ మొత్తం పర్యటిస్తూ నిరంతర అభివృద్ధికి అధికారులతో సమీక్షిస్తూ మరిన్ని కొత్త బస్సులు తీసుకురావడానికి, కొత్త సర్వీసులు ఏర్పాటు చేయడానికి తన వంతుకృషి చేస్తున్నానని, ఒకప్పుడు బస్సులు తిరగడానికి కూడా వీలు లేని రోడ్లపై ఈ రోజున గుంతలు పూడ్చి బస్సులు నడవడానికి మరింత మెరుగైన చర్యలు తీసుకోవడం జరిగిందని,శాసనసభ్యులతో కలిసి మరిన్ని సౌకర్యాలు ప్రజలకు అందే విధంగా తన వంతుగా కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జి.మురళి,స్టేషన్ మేనేజర్ కుమారి,పి ఆర్ వో నరసింహం, అనేకమంది ఆర్టీసీ కార్మికులు, పలు ఆర్టీసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## తెడ్లం శివారులో ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా - విద్యార్థులకు స్వల్ప గాయాలు



**కామవరపుకోట,మేజర్‌న్యూస్ :** కామవరపుకోటలోని విశ్వతేజ స్కూల్ బస్సు తెడ్లం శివారు లో బోల్తా పడింది. డ్రైవర్ తప్పిదంతో స్కూల్ బస్సు బోల్తా పడింది. ఈ డ్రైవర్ పై ఇంతకు ముందు ఫిర్యాదు చేసినా యాజమాన్యం చర్యలు తీసుకోలేదని స్థానికులు వెల్లడించారు. కామవరపుకోట నుండి చింతలపూడి రోడ్డులో వెళ్లే స్కూల్ బస్సుల వేగానకి హద్దు అదుపు లేదని,ఫిట్ నెస్ సరిగ్గా లేని స్కూల్ బస్సులు నడుపుతున్నా స్కూల్ యాజమాన్యం,రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థులు తల్లి తండ్రులు వివరించారు. బుధవారం బోల్తా పడిన బస్సు స్టీరింగ్ ఉదయం స్కూల్ నుండి బయలుదేరినప్పుడే పని చేయలేదు అని సమాచారం. ప్రమాదం జరిగినప్పుడు దాదాపుగా 20 మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. స్వల్ప గాయలతో బయటపడిన బస్సులో వున్న 20 మంది విద్యార్థులు పిల్లలు ఫీజులు ప్రతీ సంవత్సరం పెంచినట్లు స్కూల్ బస్సు ల నాణ్యత కూడా పెంచాలి అంటున్న స్థానికులు. కామవరపుకోట, చింతలపూడి రోడ్డు లో వెళ్తున్న స్కూల్ బస్సులను నెలకి ఒకసారి అయినా చెక్ చేయాలనీ ప్రజలు కోరుతున్నారు.

## బాలింతలు పౌష్టికాహారం పై శ్రద్ధ వహించాలి : ఎమ్మెల్యే 'బొలిశెట్టి '



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ :** ఆరోగ్యవంతమైన భావి పౌరులకోసం పోషకాహారం పై అవగాహన కలిగి ఉండాలని శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక వీకర్స్ కాలనీలో బుధవారం జరిగిన పోషకాహార పక్షోత్సవాలలో ఆయన మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణలో పోషకాలు కలిగిన ఆహారం అందించటం అత్యంత ముఖ్యమని అన్నారు. ఒక మహిళ ఆరోగ్య వంతమైన శిశువుకు జన్మ నిచ్చి రెండు సంవత్సరాల పాటు పోషకా హారంపై శ్రద్ధ వహిస్తే ఆ పిల్లల భవిష్యత్ ఎంతో బాగుంటుం దన్నారు.

ఎంతో విలువైన ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో జనసేన పట్టణ అధ్యక్షులు వర్తన పల్లి కాశీ, పెంటపాడు మండల అధ్యక్షులు పుల్లా బాబీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పాలూరి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్‌టిఎస్‌ఓలో తణుకు శ్రీ చైతన్యకు పథకాల పంట





**తణుకు,మేజర్ న్యూస్ :** శ్రీ చైతన్య తణుకు క్యాంపస్ విద్యార్థులు తమ అద్భుత ప్రతిభను కనబరిచి లాప్టాప్ సొంతం చేసుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించబడిన ఐ ఎన్ టి ఎస్ ఓ (ఇంటర్నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలింపియాడ్) పరీక్షలో మా విద్యార్థులు గర్వించదగిన విజయాలను సాధించారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ ఐఎన్ టి ఎస్ ఓ పోటీ పరీక్షలో 9వ తరగతికి చెందిన బాల అరుణ్ సోమేశ్ గ్రాండ్ ప్రైజ్‌ను గెలుచుకుని ల్యాప్‌టాప్ ను సొంతం చేసుకున్నాడు. అలాగే నాలుగవ తరగతికి చెందిన దర్శిత బొంగరాల ఫస్ట్ ప్రైజ్‌ను గెలుచుకుని టాబ్ గెలుపొందింది. మరో 62 మంది విద్యార్థిని విద్యార్థులు రెండు మూడు నాలుగు ఐదు స్థానాలతో పాటు అనేక ప్రోత్సాహక బహుమతులు,బంగారు పతకాలు గెలుచుకున్నారు. విజేతల గౌరవార్థంగా నిర్వహించిన ప్రత్యేక అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆకుల సురేఖ వారికి బహుమతులు, పథకాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు సురేఖ మాట్లాడుతూ శ్రీ చైతన్య కరికులం వల్ల ఇంతటి విజయం సాధించగలిగామని క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంలో తాము ముందుంటామని తెలియజేశారు. విజేతలందరిని ఏజీఎం పార్థసారథి, కోఆర్డినేటర్ రామారావు హృదయ పూర్వకంగా అభినందిస్తూ, వారి భవిష్యత్తు మరింత వెలుగొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డీన్ శ్రీనివాసరావు, ఏవో రామాంజనేయులు, ప్రైమరీ ఇన్చార్జిలు ప్రదీపిక,వాణి ఒలింపియాడ్ ఇన్చార్జ్ రజిని, మహేశ్వరి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు సాధించిన ఈ విజయం పట్ల తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.

## కందుకూరి వీరేశలింగం పంతులుకు ఘన నివాళులు



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో తెలుగు జాతి గర్వించదగిన మహోన్నతవ్యక్తి,గొప్ప నాటక రచయిత,నవయుగవైతాళికుడు,బహుముఖ ప్రజ్ఞాశాలి,సమాజ సేవకుడు, నవోదయకవి,రావు బహదూర్ శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు 177 వ' జయంతి సందర్భంగా డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు బుధవారం ఆయన చిత్రపటంనకు పులమాలతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమములో అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్,జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది,పాఠకులు, పాల్గొన్నారు.

## విలీన పంచాయితీలలో కుంటుపడిన అభివృద్ధి




**పాలకొల్లు,మేజర్ న్యూస్:** మండలంలో పూలపల్లి పంచాయతీ పరిధిలో బుధవారం గ్రామసభ నిర్వహించారు, ఈ సందర్భంగా టిడిపి నాయకులు పాముల రజిని కుమార్ మాట్లాడుతూ విలీన గ్రామాలు అభివృద్ధికి పారిశుధ్య పనులకు నోచుకోకుండా అటు మున్సిపాలిటీలో విలీనం కావడానికి జాప్యం జరగడం వల్ల ,పంచాయతీ నిధులు రావడంలేదని, దీనివల్ల అభివృద్ధి, కుంటుపడిందని, అన్నారు,జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఇచ్చే నిధులు, పంచాయితీ కి ప్రజలు కట్టే పన్నులతో అభివృద్ధి,పారిశుద్ధ్య పనులకు ఖర్చు చేస్తున్నామని, ప్రభుత్వం నుండి వచ్చే గ్రాండ్లు కొరవడినాయని అన్నారు, ఉపాధి హామీ పనులకు 200 జాబు కార్డులు వచ్చాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు ఎంపీడీవో నాగళ్ళ ఉమామహేశ్వరరావు, కార్య నిర్వహణ అధికారి పాల శ్రీనివాస్, టిడిపి నాయకులు కోడి విజయభాస్కర్, ఇంటి శ్రీరాముడు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి రీజినల్ చైర్మన్ అప్పల నాయుడు రాజుకు పరామర్శ



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆంధ్ర జ్యోతి దినపత్రిక బ్యూరో ఇన్‌ఛార్జ్ జీ.వి.ఎస్.ఎన్.రాజు తండ్రి గొట్టుముక్కల సీతారామరాజు (96) బుధవారం స్వర్గస్తులయ్యారు. అనారోగ్య కారణాలతో ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని శనివారపు పేటలోని వారి స్వగృహానికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు అక్కడకు వెళ్ళి వారి భౌతిక కాయాన్ని సందర్శించి పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. జీవిఎస్‌ఎన్ రాజు,ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి,ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు.

# చదువుల తల్లులకు నూజివీడు బిజెపి నేతల చిరు సత్కారం





**నూజివీడు,మేజర్‌న్యూస్ :** ఇంటర్ విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన చదువుల తల్లులకు నూజివీడు పట్టణ బిజెపి అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు చిరు సత్కారం చేశారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో నూజివీడు చరిత్రలోనే మొట్టమొదటి సారిగా 991 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచిన శ్రీ శారద కళాశాల విద్యార్థిని కుప్పాల దేదీప్యసాయిని బుధవారం కళాశాల ఆవరణలో మల్లెపూడి నాగరాణి, సీనియర్ నాయకులు బోను అప్పారావులు దుశ్శాలవాలతో సత్కరించి,భారత మాత మెమెంటోను బహుకరించారు. విద్యార్థిని తల్లిదండ్రులైన, కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ కుప్పాల శంకరరావు,రాదికలకు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లెపూడి నాగరాణి మాట్లాడుతూ విద్యలవాడగా భాసిల్లుతున్న నూజివీడు పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికమార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు పొందడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతంలో ముఖ్యంగా కార్పొరేట్ విద్యా వ్యవస్థలకు ధీటుగా శ్రీశారద విద్యాసంస్థలు నిలవటం నూజివీడుకే గర్వకారణమన్నారు. తల్లీదండ్రుల ప్రోత్సాహం, కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం నిరంతర శ్రమ, విద్యార్థిని కృషితో సాధించిన ఈ ఘనత చిరస్మరణీయమన్నారు. స్నేహరైడ్స్ 'శైలు'ప్రతిభస్ఫూర్తి దాయకం. నూజివీడు స్నేహరైడ్స్ చిల్డ్రన్స్ హోమ్‌లో ఆశ్రమం పొంది ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసిస్తూ ఎటువంటి ట్యూషన్ లేకుండా బైపీసీలో 772 మార్కులు సాధించి బి.శైలు స్ఫూర్తిగా నిలిచిందని బిజెపి శ్రేణులు కొనియాడారు. చిన్నతనంలో తల్లీదండ్రులుకోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉన్నశైలుని స్నేహరైడ్స్ ఆదరణలో చదువులతల్లిగాఎదగటం అభినందనీ యమన్నారు. విద్యార్థిని శైలుని ఈసందర్భంగా బిజెపిఅధ్యక్ష, ఉపాధ్యక్షు రాలు మల్లెపూడి నాగరాణి, రాయపాటి విజయ లీలా జ్యోతి, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు షేక్ బాజీమా దుశ్శాలవాతో సత్కరించి మెమెంటోను, మల్లెపూడి నాగ రాణి నగదు బహుమతిని అందచేశారు. ఈకార్యక్రమంలో స్నేహరైడ్స్ అధినేత బసవరాజు నగేష్,పార్టీ నాయకులు అంబటి మల్లేశ్వరరావు, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి దద్దనాల రవికిషోర్, కార్యదర్శి సూర్యప్రకాష్ కుమార్ శ్రీశారద అధ్యాపకులు,సిబ్బంది,స్నేహరైడ్స్‌విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

### టిడిపి నేత వీరమల్లు





**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు.వడాలి గ్రామంలో పంచిరెడ్డి రాజారావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి,మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పాదచారులకు, ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.దాతలు ముందుకొచ్చి ప్రధాన కూడళ్ళలో,రహదారుల పక్కన చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నక్కా రంగారావు,నక్కా అప్పారావు,బొంతు వెంకటరంగ అప్పారావు ,బొంతు మహేష్, మరడాని సత్యనారాయణ, మారగాని శంకరరావు, తరంగబాబు, బొర్రా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నేత పప్పుల రామారావు కుమారుని వర్ధంతి సందర్భంగా అన్నదానం



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** వైయస్సార్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పప్పుల రామారావు కుమారుడుపప్పుల భాస్కర శ్రీకృష్ణ నరేష్ 15వ వర్ధంతి సందర్భంగా బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా రుస్తుం బాధ లెప్రసి కాలనీ లోని పేదలకు, బొండమ్మ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు,పాత బజార్ సాయిబాబా గుడి వద్ద పలుచోట్ల అన్న అన్నదానం చేశారు.ఈ సందర్భంగాపప్పుల రామారావు మాట్లాడుతూ తన కుమారుడు మరణించి 15సంవత్సరాల అవుతుందని అప్పటినుండి ప్రతియాట పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

# మరణించిన ఉపాధి హామీ కూలీలకు రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలి

### వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**మొగల్తూరు,మేజర్‌న్యూస్ :** ఉపాధి హామీ పనిచేస్తు ప్రమాదంలో మరణించిన వ్యక్తుల కుటుంబాలకు10 లక్షలు చొప్పున ఇవ్వాలని, గాయపడిన కుటుంబానికి 5లక్షల ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి,జక్కంశెట్టి సత్యనారాయణ,జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు డిమాండ్ చేశారు.బుధవారం మొగల్తూరు హైవే పక్కన పంట కాలువలో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలుపై మొగల్తూరు వైపు మంచి నూనె లోడుతో వస్తున్న వాహనం కూలీల పైకి దూసుకు వెళ్లడంతో కడలి పావని,గుబ్బల గంగాదేవి ఇద్దరూ వాహనం కింద ఇరుక్కుపోయి వెంటనే చనిపోయారు.గుబ్బల మాణిక్యాలరావు, గుబ్బల సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డారు.గాయపడ్డ మాణిక్యాలరావును భీమవరం వర్మ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు.సత్యనారాయణకు నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నారు.మరణించిన కడలి పావనీకి పెండ్లికి వచ్చిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తీవ్రంగా గాయపడ్డ మాణిక్యాలరావు మరణించిన గంగాదేవికి భర్త. వీరంతా వ్యవసాయ కార్మిక కుటుంబాలు కావడం ఆగ్రామ ప్రజలంతా నరసాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద బోరును విలపిస్తున్న పరిస్థితి ఉంది.ఈసందర్భంగా నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి బయట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు నిరసన



కార్యక్రమం తెలిపారు.ఈసందర్భంగా జార్జి పెద్దిరాజు సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి కేవలం 50వేలు మాత్రమే ఇచ్చే అవకాశం ఉందని కానీ ఇక్కడ జరిగిన ప్రమాదం దానికి వర్తించదని ప్రభుత్వం ప్రత్యేకంగా ఆలోచించి స్థానిక ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ చర్చించి మరణించిన వారి కుటుంబానికి 10లక్షలు,గాయపడిన కుటుంబానికి 5లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుడాల ముత్యాలరావు, మామిడి శెట్టి చందర్రావు, చింతపల్లి నాగేశ్వరరావు,గుడాల సుజాత, మామిడి చెట్టిసత్యవతి,గూడూరి భాస్కరరావు, లక్ష్మీకాంతం, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### సీఐటీయూ డిమాండ్




**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ మునిసిపల్ వర్కర్స్ పెడరేషన్ (సీఐటీయూ)రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా తాడేపల్లిగూడెం మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు.ఈధర్నా నుద్దేశించి మునిసిపల్‌వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనాల వెంకట్రావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఏళ్ళ తరబడి సేవలు అందించి మరణించిన మరియు అనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి బిడ్డలకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని అన్నారు.కాంటాక్ట్ కార్మికుల రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలు ఉండాలని డిమాండ్ చేశారు.క్లాప్ ఆటో కార్మికులుకు జీతాలు బకాయిలు చెల్లించాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు జిఓ నెంబర్ 36ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు.కార్మికులు సరిపడగా పనిముట్లు ఇవ్వాలన్నారు.పిఎఫ్, ఈఎస్ఐ బకాయిలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొడమంచిలి బాబు, తాడికొండ జయరాం,తదితరులు పాల్గొన్నారు

## పెద్ద గోపురం ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రారంభం



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** పట్టణ పెద్ద గోపురం ప్రాంతంలో బుధవారం విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను కూటమి నాయకులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఈ ప్రాంతంలో లో వోల్టేజీ సమస్య వేధిస్తుందని, గత ప్రభుత్వంలో నాయకులు పట్టించుకోలేదని తెలిపారు. మంత్రి రామానాయుడు నియోజకవర్గంలో లో వోల్టేజీ సమస్య ఎక్కడ ఎక్కడ ఉందో స్వయంగా తెలుసుకొని పరిష్కార దిశగా అవసరమైనచోట్ల విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను కొత్తగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. పాలకొల్లు నియోజకవర్గం మొత్తంమీద 99 ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారని బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడిఈ రామకృష్ణ, నాయకులు గండేటి వెంకటేశ్వర రావు ,ఉన్నమట్ల కబర్ధి,తుల రామ లింగేశ్వర రావు,సిడగం సూరి ,శ్రీకాకులపు వెంకన్న ,కర్నేన గౌరు నాయుడు , పిసిని రాము,ధనాని సూర్య ప్రకాష్ ,పోట్నూరి శ్రీనివాస్,బేరం శ్రీ రామ చంద్ర మూర్తి,మల్లంపల్లి ఫకీర్ బాబు,సిడగం సత్యశ్రినివాస్, గాది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు చాంబర్స్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** ఈనెల 17వ తేది గురువారం ఉదయం 9 గంటల నుండి ఛాంబర్స్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శిక్షణ , ఉద్యోగ కల్పనా సంస్థ వికాస వారి సౌజన్యంతో 13 కంపెనీలతో మెగా జాబు మేళ నిర్వహించబడుతుంది. ఐసిఐసిఐ, హెచ్డిఎఫ్సి ,హెచ్డిబి, డెక్కన్ కెమికల్స్, పానాసోనిక్, ఇండో ఎంఐఎం, ఇసుజు, కాగ్నెంట్ వంటిబ్యాంకింగ్,ఐటి,నాన్ ఐటీ సంస్థలకు చెందిన 470 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించబడును. జీతం 12700 నుండి 36000 వరకు ఉంటుంది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈక్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరగు అభ్యర్థులు రెజ్యూమ్‌తోపాటు సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలుతో హాజరుకావాలని,వివరములకు 9912046234, 94935 03441 నెంబర్లలో సంప్రదించవలెనని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలియజేశారు.

# ఎరువుల నియంత్రణకు ఉపకరించే తొలి ప్రయోగశాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్





### రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించే లక్ష్యంతో ఖచ్చితమైన ప్రయోగఫలితాలు అందజేయాలి

**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెంలోని ఎరువుల నియంత్రణ ఉత్తర్వుల ప్రయోగశాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సందర్శించి,రాష్ట్రంలోనే మొట్టమొదటిగా తాడేపల్లిగూడెం ప్రయోగశాల నందు రూ.27 లక్షలతో ఏర్పాటుచేసిన అటోమిక్ అబ్సెర్షన్ స్పెక్ట్రో ఫోటోమీటర్‌ను, రూ.21 లక్షలతో ఏర్పాటు చేసిన గ్యాస్ లిక్విడ్ చోరోమెటోగ్రఫీ మిషనరీని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ప్రయోగ పరీక్షలు నిర్వహించే విధానాన్ని శిక్షణ పొందిన అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈయంత్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులలో సూక్ష్మ, స్థూల పోషకాలను పరీక్షించేందుకు వినియోగించడం జరుగుతు oదని తెలిపారు.ఈప్రయోగశాలలో సంవత్సరానికి 3 వేలు ఎరువులు, 2 వేలు పురుగుమందుల శాంపిల్స్‌ను తనిఖీ చేసి నివేదికలను అందజేయడం జరుగుతుందని, అలాగే విత్తనాలు, భూసార పరీక్షలు కూడా నిర్వహించడం జరుగుతుందని వారు వివరించారు.జిల్లా కలెక్టర్ అక్కడ పనిచేస్తున్న వ్యవసాయశాఖ ఏడిఏ, వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడుతూ బాధ్యతగా పనిచేసి ప్రయోగశాలకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రయోగశాలకు మధునాతన ప్రయోగ యంత్రాలను అందించడం జరిగిందన్నారు.ఈయంత్రం ద్వారా ఎరువులలో జింకు, కాపర్, మెగ్నీషియం తదితర సూక్ష్మ పోషకాలు లభ్య త తెలుసుకోవటానికి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అలాగే నాణ్యమైన ఎరువులను పరిశీలించి రైతులకు అందుబాటులోనికి తేవటానికి ఈ యంత్రాలు ఉపయోగపడతాయని అన్నారు పురుగుమందుల ల్యాబ్ రేటరీ జిఎల్‌ఎస్ విశ్లేషణలో బాగా వస్తుందని అన్నారు.దేశరాష్ట్రంలోనే ఎక్కడలేని విధంగా తాడేపల్లిగూడెంలోనే రీజనల్ కోడింగ్ సెంటర్, ప్రయోగశాల ఉండటం చాలా గొప్ప విషయం అన్నారు. రాష్ట్రం మొత్తం ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు శాంపిల్స్ను సేకరించి తాడేపల్లిగూడెం, అమరావతి, విశాఖపట్నం,తిరుపతి రీజనల్ కోడింగ్ సెంటర్లకు పంపడం జరుగుతుందని, అక్కడనుండి బాపట్ల తాడేపల్లిగూడెం అనంతపురం ప్రయోగశాలలకు పంపి పరీక్షల నిర్వహించి పరీక్ష ఫలితాలను తిరిగి డీకోడింగ్ సెంటర్‌లకు పంపడం జరుగుతుందన్నారు. ప్రయోగ ఫలితాలలో నాణ్యత లోపిస్తే కేసులు బుక్ చేయడం జరుగుతుందని, తాడేపల్లిగూడెం సెంటర్లో నిర్వహించిన పరీక్ష ఫలితాలు సంబంధించి 101 కేసులను రిఫర్ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం వ్యవసాయశాఖ కార్యాలయం ఆవరణలో మామిడి మొక్కను జిల్లా కలెక్టర్ నాటారు. ఈసందర్భంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటే శ్వరరావు, ఏడిఏ జె.శశి బిందు, డిడి శ్రీనివాస్, ఏవోలు వై.ఇంది రాఘూన్సీ, ఏడిఏ మురలీకృష్ణ, తదితరులు ఉన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 92 ఫిర్యాదులు పరిష్కారం






లింగపాలెం,మేజర్ న్యూస్: లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో శాసనసభ్యుల సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ నా సొంత మండలానికి ఇప్పటికీ సిసి రోడ్ల నిర్మాణానికి 6 కోట్ల రూపాయలకు పైగా మంజూరు చేయించాను ఇంకా ఈ మండలాభివృద్ధికి నా తోడ్పాటును అందిస్తాను అలాగే అధికారులు అందరూ స్థానిక కూటమి నాయకులతో కలిసి పనిచేయాలని సూచించారు. అదేవిధంగా ప్రజలు వారి సమస్యలు శాసనస భ్యులకు స్వయంగా చెప్పుకున్నారు. మరి కొంతమంది అర్జీల రూపంలో తీసుకొని వచ్చి శాసనసభ్యులకు అందించారు. అలాగే ప్రజా సమస్యలు తీసుకోవడానికి కొన్ని కౌంటర్లను ఏర్పాటు చేశారు. మొత్తం వచ్చిన అర్జీలు 92 వాటిలో కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించారు. సంబంధిత అధికారులకు అందించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. మళ్లీ గ్రీవెన్స్ జరిగే నాటికి పరిష్కారం చూపాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వాణి,మండల విస్తరణాధికారి జెయం రత్నకుమార్, లింగపాలెం సర్పంచ్ టి.హేమలత,ఎంపీటీసీ సభ్యులు బి.స్వరూప రాణి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గరిమెళ్ళ చలపతి రావు,మండల కూటమి కార్యకర్తలు అన్నిశాఖల అధికారులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిరోధానికి కృషి చేసిన కందుకూరి



**కైకలూరు,మేజర్‌న్యూస్:** తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి తెలుగు భాష సంరక్షణకు ఎంతో కృషి చేసిన కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ ఆయన మాట్లాడుతూ స్త్రీ విద్యకై ఉద్యమించి, ప్రచారం చేయడమే కాక బాలికల కొరకు పాఠశాలను ప్రారంభించారు.మగపిల్లలతో ఆడపిల్లలు కలిసి చదువుకునే సహా విద్య విధానాన్ని ప్రవేశపెట్టారని అంటరాని కులాలకు చెందిన పిల్లలను కూడా కూర్చొని మిగతా పిల్లలతో కలిపి చదువుకునే విధానాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. వారికి ఉచితంగా చదువు చెప్పటంతో పాటు పుస్తకాలు పలక బలపాలు కొని ఇచ్చేవారని అన్నారు. బాల్య వివాహాలు నిర్మూలన కోసం ఉద్యమించిన గొప్ప సంఘసంస్కర్త. మూఢనమ్మకాలుపై యుద్ధం ప్రకటించిన కలియుగం యోధుడు వీరేశలింగం పంతులు అని కొనియాడారు. ఆయన 1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో జన్మించారు.బ్రిటిష్ పాలనలోబాల్యవివాహాలు ఎక్కువగా జరిగేవని, దీనికి నిరసనగా ఆయన పెద్ద ఎత్తున నిరసన ఉద్యమం చేపట్టారు.అనేక సామాజిక సంస్కరణలో కూడా పాలుపంచుకొని, సాంఘిక దురాచారలను నిర్మూలించేందుకు ఆయన శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు వివాహాలు చేసి కాపురాలకు వెళ్ళకముందే భర్తలుచనిపోయి వితంతువులై అనేకకష్టాలు ఎదుర్కొన్నారు.దీనిని రూపుమాపేందుకు బాల్యవివాహాలు నిర్మూలనకు పిలుపునిచ్చారు. దేశంలోనే మొట్టమొదటి వితంతువుల పునర్వివాహాలు జరిపించటమే కాకుండా ఆచరణలో పెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌పై అభిప్రాయాలు క్యూ ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి -కమీషనర్ అంజయ్య



**నరసాపురం,మేజర్‌న్యూస్:** అన్న క్యాంటీన్లలో అందిస్తున్న ఆహార పదార్థాలు, సమయంపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా తెలియచేయవచ్చని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. బుధవారం స్టీమర్ రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ని పరిశీలించి ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీచేశారు.ఈసందర్భంగా కమిష నర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అన్న క్యాంటీన్లలో రూ.5కే పేదలకు ఆహారం అందిస్తుందన్నారు. క్యాంటీన్ల సమయం,ఆహారంపై ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా మార్పులు చేస్తున్నా రన్నారు. అన్నక్యాంటీన్లలో ప్రతి రోజు నిర్దేశిత సమ యంలో ఆహారం అందించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే క్యాంటీన్లలో ఉదయం 7 గంటల నుండే ఆహారం అందించేలా సమయం మార్చారన్నారు. క్యాంటీన్ కు వచ్చే ప్రజలు తమ అభిప్రాయాలను క్యాంటీన్ లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలియచేయవచ్చని పేర్కొన్నారు ఈకార్యక్రమంలో డిఈ.రవిచంద్ర. ఏఈ.దుర్గా కిషోర్. సానిటరి ఇన్స్పెక్టర్ పాత్రుడు పాల్గొన్నారు.

## కొప్పర్రులో తెలుగు భాష ప్రాధాన్యత పై అవగాహన



**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :**మండలం లోనికొప్పర్రు గ్రామానికి చెందిన కొప్పర్తి కథావాహిని యూ ట్యూబ్ ఛానెల్ రూపకర్త, ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఏజీఎం కొప్పర్తి రాంబాబు ఉద్యోగవిరమణ అనంతరం తెలుగు భాషమీద అభిమానంతో భాషా వ్యాప్తికి అభివృద్ధికి కృషి చేస్తున్నారు.వారి కృషిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున 9 వ తరగతి తెలుగు వాచకానికి పరిష్కర్తగా వ్యవహరించారు. బుధవారం కొప్పర్రు జిల్లాపరిషత్ హై స్కూల్ విద్యార్థులకు తెలుగు భాష ప్రాధాన్యత తెలుగు భాషలో ప్రావీణ్యత అనే అంశం మీద దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో హై స్కూల్ ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయుడు చేమకూరి రాంబాబు , ఉపాధ్యాయుడు బొలుశెట్టి శ్రీను, చినమిల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.రాంబాబుని పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

## వైయస్ పాలెంలో 18 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహావిష్కరణ



**నరసాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** మండలంలోని యర్రంశెట్టివారి పాలెం గ్రామ పంచాయతీపితాని నరకనందు బుధవారం18 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పరిసర ప్రాంత గ్రామాలనుండి పెద్ద ఎత్తున భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.గుబ్బల సత్యనారాయణ కుమారులు గ్రామస్తులు ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో కాపుకార్పొరేషన్ చైర్మన్‌కొత్తపల్లి సుబ్బారాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి భుజంగ రాయలు య ర్రం శెట్టి బాబులు, దొంగ మురలీకృష్ణ దంపతులు ప్రత్యేక పూజ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవాలి





**– క్రమం తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలి : జిల్లా కలెక్టర్**

**భీమవరం,మేజర్ న్యూస్ :** ఏడవ పౌష్టికాహార పక్షోత్సవాలు సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరం నందు స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా శాసనసభ్యులు, పిఏసి చైర్మన్ పులపర్తి రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు మంచి పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు బలంగా,ఆరోగ్యవంతంగా జన్మిస్తారన్నారు. ఆరోగ్యవంతమైన బావి పౌరులను అందించే బాధ్యత మీపై ఉందన్నారు. స్త్రీ గర్భం దాల్చిన నాటి నుండి ప్రసవం అయ్యే వరకు వైద్యుల సూచనలు మేరకు మందులు, బలవత్తరమైన ఆహారం తీసుకుంటేనే బిడ్డ పుట్టిన తర్వాత ఎటువంటి అనారోగ్య సమస్యలు రావన్నారు. గర్భిణీ స్త్రీలు బయట హోటల్స్ ఆహార పదార్థాలు, కూల్ డ్రింక్స్,చాక్లెట్స్ వంటి తినుబండారాలు తినకూడదని స్పష్టం చేశారు. మీకు ఏమైనా తినాలనిపిస్తే ఇంటి వద్దనే తయారు చేసుకుని తినాలన్నారు. శాసనసభ్యులు, పిఏసి చైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ప్రతిరోజు పాలు,ఆకుకూరలు తప్పక తీసుకోవాలన్నారు. పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం మొత్తం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి,శాసనసభ్యులు పులపర్తి రామాంజ నేయులు 15 మంది గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతల కార్యక్రమం నిర్వహించి, వివిధ రకాల ఫలాల కిట్‌ను అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఏడవ పౌష్టికాహార పక్షోత్సవ సమాచార గోడ పత్రికను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, రాష్ట్ర పిఏసి చైర్మన్ ,స్థానిక శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు ఆవిష్కరించారు.అంగన్వాడిలు తయారు చేసిన గర్భిణీ స్త్రీలకు అందించే పౌష్టికాహారం పదార్థాలను జిల్లా కలెక్టర్,శాసనసభ్యులు రుచి చూశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, జిల్లా వైద్య శాఖ అధికారి గీతాబాయి, సిడిపివోలు, ఐసిడిఎస్ సిబ్బంది, గర్భిణీ స్త్రీలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే రైతు రాజ్యం సాధ్యం

**– శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్**



**పెంటపాడు,మేజర్ న్యూస్** నిజమైన రైతు రాజ్యం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని, సుసంపన్నమైన గ్రామాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌ల కూటమి ప్రభుత్వ నాయకత్వంలో తామంతా పనిచేస్తున్నామని వారు ఇచ్చిన ప్రోత్సాహంతో గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలుగా నిలుస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్,శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం రూరల్ మండలం,పెంటపాడు మండలాలకు చెందిన 98 మంది వ్యవసాయదారులకు రూ.38.01 లక్షల రూపాయల విలువైన వ్యవసాయ యాంత్రిక ఉపకరణాలైన పవర్ టిప్పర్స్, రోటోవేటర్స్, బ్యాటరీస్ ప్రేయర్స్,పవర్ స్ప్రేయర్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాకు ఇచ్చిన 62,500 ఓట్లను అభివృద్ధి రూపంలో తిరిగి ప్రజలకు అందించేందుకై తాను సిద్ధంగా ఉన్నానని ఆయన అన్నారు. తాను పదవిలోకి వచ్చే సమయానికి అలంపురం, ప్రత్తిపాడు, కృష్ణపాలెం, నవాబుపాలెం, నిడదవోలు గుంతల రోడ్లతో నరకం చూసిన ప్రజలు నేడు తారురోడ్లతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. అదే విధంగా వైజంక్షన్ నుంచి తాడేపల్లిగూడెం వరకు కొత్త రోడ్డు నిర్మాణానికి ముఖ్య మంత్రి ఏడు కోట్ల రూపాయల నిధులను కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఇంచార్జ్ ఈతకోట తాతాజీ,మండల అధ్యక్షుడు పుల్లా బాబి,కసిరెడ్డి మధులత, రూరల్ మండలం అడపా ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి,కృష్ణ రాజు, భోగేశ్వర రావు,ప్రసాద్,మారుతి మారుతి రవి, తాడిపూడి ప్రగతి, చెరుకూరి సోమశేఖర్,డిఏఓ వెంకటేశ్వర రావు,ఏడిఏ పి మురళీకృష్ణ, ఎమ్మార్వో సీతారత్నం,పలు గ్రామాల సర్పంచులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యం అమ్మాలి





**– పిల్లలను బాగా చదివించాలి**

**: ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేర్చాలి**

**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** పెద్ద తాడేపల్లి రైతు సేవా కేంద్రమును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించి రైతులతో మాట్లాడారు. దాన్యం కొనుగోలు కేంద్రాలు పనితీరు గురించి బుధవారం ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సకాలంలో జరుగు జరుగుచున్నవన, 24 గంటల వ్యవధిలో ఎకౌంట్లో డబ్బులు పడుతున్నాయని అని తెలుసుకున్నారు. గోనెసంచులు సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ఎటువంటి ఇబ్బందులు లేవని అధికారులు సకాలంలో సహకరిస్తున్నారని చెప్పారు. ఇంత త్వరగా డబ్బులు ఎకౌంట్లో జమ కావడం ఇంతకుముందు ఎన్నడూలేదని,డబ్బులు కోసం నెలలు తరబడి ఎదురుచూసిన పరిస్థితిఅని, ఇప్పుడు మిల్లుకు వెళ్లిన రోజునే డబ్బులు పడటం జరుగుతుందని చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు. గంగాధర్ అనే రైతు దాన్యం పట్టుబడి జరుగుచున్న కల్లం వద్దకు వెళ్లి కలెక్టర్ ధాన్యం పట్టుబడిన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు ఏ రకాలను సాగు చేశారు. ఎంత దిగుబడి వచ్చింది అడుగగా ఎం టి యు 1121 వరిసాగు చేయటం జరిగిందని, ఎకరాకు 50 నుండి 52 బస్తాల వరకు దిగుబడి వచ్చిందని జిల్లా కలెక్టర్ కు రైతు గంగాధర్ తెలిపారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బం దులు లేవని సంతృప్తి వ్యక్తం చేశారు. మీ పిల్లలు ఏమి చదువుతున్నారు. ఎక్కడ చదువుతున్నారు.

అని రైతులను ఆరా తీయగా కొంతమంది రైతులు మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని, చాలా తక్కువ మంది రైతులు ప్రైవేట్ స్కూల్లో చదువుతున్నారని తెలుపగా, కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల్లో చదివించి ప్రభుత్వం నుండి వచ్చే అన్ని ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి రైతులతో అన్నారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, ఏడిఏలు శశి బిందు, హేమ కుమారి, ఎం ఏ ఓ ఆర్ఎస్ ప్రసాద్ వి ఏ ఏ అలేఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం ప్రాజెక్టు పరిధిలో మట్టి నాణ్యత పరీక్షలు



**పోలవరం,మేజర్ న్యూస్ :** పోలవరం బహుళార్థక సాధక ప్రాజెక్టు పరిధిలో నిర్మాణాలకు వినియోగించే మట్టి నాణ్యతను కేంద్ర నిపుణుల బృందం మంగళవారం పరీక్షించింది. సెంట్రల్ మెటీరియల్ అండ్ సాయిల్ రీసెర్చ్ సెంటర్ నిపుణులు బి. సిద్దార్థ్ హెడావో, విపుల్ కుమార్ గుప్తా పోలవరం ప్రాజెక్ట్ స్పిల్ వే తో పాటు పలు ప్రాంతాల్లో నిల్వ ఉంచిన మట్టి నమూనాలు సేకరించి పరీక్షించారు. బుధవారం కూడా ఈ పరీక్షలు జరుగుతాయి. నిపుణులు అందచేసే మట్టి నాణ్యత పరీక్షల నివేదిక ఆధారంగా నిర్మాణాల్లో మట్టిని అవసరమైన ప్రాంతాల్లో వినియోగిస్తామని అధికారులు తెలిపారు.నిపుణుల బృందం వెంట జలవనరుల శాఖ, నిర్మాణ సంస్థ మేఘా ప్రతినిధులు ఉన్నారు.

## ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మానవత ఆపన్న హస్తం





**ఉండి,మేజర్ న్యూస్ :** సమాజంలో ఆర్థికంగా వెనుక బడిన వర్గాలకు ఆపన్న హస్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఇస్తుందని పలువురు వక్తలు అన్నారు. ఉండి మండలం చెరుకువాడలో బుధవారం మోదుగుమూడి పెద్దిరాజ కుటుంబానికి ఉండి మానవత శాఖ ఆధ్వర్యంలో నెలకు సరిపడ నిత్యావసర సరుకులు, బియ్యం,కూరగాయలు, కొంత నగదు అందించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి డాక్టర్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ మానవత సంస్థ సేవలు వెలకట్టలేనివి అన్నారు. సంస్థ మండల ఛైర్మెన్ రుద్రరాజు యువరాజు,కో ఛైర్మెన్ దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ బాధల్లో ఉన్నవారి రెండు కన్నీటి బొట్లు తుడవగల్గటం మానవత ప్రధాన ధేయం అన్నారు. సంస్థ కోశాధికారి కేటీఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్ఆర్ఐ లుముందుకు వచ్చి మానవతకు సహాయ పడితే మరిన్ని సేవా కార్యక్రమాలు ఎక్కువ మందికి అందుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు రాములమ్మ, ఆర్ఎస్ బాబు,మాన్యం వాసు తదితరులు పాల్గొన్నారు.

## జూలై 31వరకు ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ మోదు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** దీపం-2 కింద రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రక్రియలో భాగంగా ఈ నెల 1వ తేదీ నుంచి జూలై 31 వ తేదీ వరకు ఈ ఉచిత రెండో సిలిండర్‌ను బుక్ చేసుకోవల్సిందిగా జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ప్రస్తుతం నాలుగు నెలలకు ఒకటి చొప్పున ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లను ఇవ్వడం జరుగుతున్నదన్నారు. రెండో విడత ఏప్రిల్ 1 నుంచి మొదలైందని, ప్రతీ 4 నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఉచితంగా ఇవ్వబడు తుందన్నారు. దీపం-2 పథకం కింద రెండో విడతలో గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకుంటే రెండు రోజుల్లో సిలిండర్ ఇంటికి డెలివరీ చేస్తారన్నారు. మొదట లబ్ధిదారులు డబ్బులు చెల్లిస్తే ఆ తర్వాత 48 గంటల్లో ఆ డబ్బును ప్రభుత్వం లబ్దిదారుల బ్యాంక్ అకౌంట్‌లోకి జమ చేస్తుందన్నారు. దీనికి సంబంధించి ఏమైనా అనుమానాలుంటే 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునన్నారు. ఇంకనూ ఎవరైనా లబ్ధిదారులు సంబందిత గ్యాస్ ఏజెన్సీలో ఈకేవైసీ చేసుకోకపోయినా, బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం కాకపోయినా మరియు ఆధార్ అప్ డేట్ చేయించుకోకపోయినా వెంటనే చేసుకోవాలని తెలిపారు.

# మూడేళ్లలో చింతలపూడి ఎత్తిపోతల పూర్తి

## – ఎంపీ పుట్టా మహేష్ ,ఎమ్మెల్యే సొంగా రోషన్ వెల్లడి



**చింతలపూడి,మేజర్ న్యూస్ :** సాగు, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చేపట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రానున్న మూడేళ్లలో పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. గోద్రెజ్ కంపెనీ సమకూర్చిన రూ. 10 లక్షల విలువైన పరికరాలను ఎంపీ మహేష్ కుమార్, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగిరిపల్లి పర్యటన సందర్భంగా చింతలపూడి ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించారని తెలిపారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని పూర్తిగా పక్కన పెట్టిందని, ఫలితంగానే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని ఎంపీ పేర్కొన్నారు. ఏలూరు– జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిని నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు మంజూరు కోరుతూ ఇప్పటికే అధికారులు డిపిఆర్ (సమగ్ర పథక నివేదిక) ను ప్రభుత్వానికి సమర్పించారని ఎంపీ తెలిపారు. చింతలపూడి పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేసినట్లు ఎంపీ స్పష్టం చేశారు. చింతలపూడి ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా వర్గోన్నతి కల్పించడానికి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఎనలేని కృషి చేశారని ఎంపీ స్పష్టం చేశారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో 8 ఫ్యాక్టరీలు ఉన్నాయని, వాటి నుంచి సిఎస్ఆర్ నిధులు సాధ్యమైనంత ఎక్కువ రాబట్టి స్మశానాల అభివృద్ధికి కేటాయిస్తామని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, డి.సి.హెచ్.ఎస్ పాల్ సతీష్, ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరావు, టిడిపి సీనియర్ నాయకుడు ముత్తారెడ్డి,టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉద్యమ స్ఫూర్తి శిరం విశ్వనాధం మాస్టారు : ఎమ్మెల్సీ గోపీమూర్తి




**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** విద్యార్థులకు 40 ఏండ్లు విద్యా బోధన సాగించడంతో పాటు యూటీఎఫ్ కార్యకర్తగా ఉద్యమ స్ఫూర్తి ని శిరం విశ్వనాధం మాస్టారు ముందుకు తీసుకుని వెళ్ళారని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. మంగళవారం రాత్రి మండలం లోని మార్టేరు శ్రీ వేణుగోపాల ఫంక్షన్ హాల్లో జరిగిన కాకిలేరు జిల్లా పరిషత్ హై స్కూల్లో సోషల్ అసిస్టెంట్‌గా పనిచేసి,పదవీ విరమణ చేసిన విశ్వనాధం దంపతుల అభినందన సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సభకు పాఠశాల హెచ్. ఎం. బొడ్డు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, ఇరగవరం ఎం.ఈ.ఓ కే.శ్రీనివాస రావు, పోడూరు ఎం.ఈ.ఓ. జి.వి.సూర్యనారాయణ, విశ్రాంత ఎంఈఓలు కృష్ణారావు, శ్రీరామ కృష్ణ,మార్టేరు ఉప సర్పంచ్ కర్రి వేణుబాబు యూటీఎఫ్,నాయకులు కే.రామభద్రం, ఎస్.ఎస్.వి. అవధాని,కేతా వెంకటేశ్వర రావు, మానేపల్లి, ఎస్.పెద్దిరాజు,మానవతా ప్రతినిధులు కొత్త సత్యనారాయణ మూర్తి,కర్రి కృష్ణా రెడ్డి తదితరులు ప్రసంగించారు.తన వృత్తి జీవితంలో సహకరించిన అందరికీ శిరం మాస్టారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా విశ్వనాధం మాస్టారుని ముఖ్య అతిధి ఎమ్మెల్సీ గోపి మూర్తి,ఎంఈ ఓ లు,ఉపాధ్యాయులు ,మిత్రులు, బంధువులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ప్రముఖ కవి,రచయిత, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు యన్. కే.నాగేశ్వరరావు సభను నాలుగు గంటల పాటు జన రంజకంగా నిర్వహించారు.

# స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లభ్యత ఉండేలా ప్రణాళిక





## – జిల్లా ఇంచార్జి కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా అవసరాలకు అనుగుణంగా ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ఇసుకలభ్యత ఉండేలా పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి గనుల శాఖ అధికారులను ఆదేశించారు.స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం ఇంచార్జి కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.ఈసందర్భంగా ధాత్రిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉచిత ఇసుకవిధానంద్వారా ప్రజల అవసరాలకు, వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి, నిర్మాణ పనులను అవసరమైన ఇసుక ను అందుబాటులో ఉంచేవిధంగా ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీస్లిటేషన్ పాయింట్, స్టాక్ పాయింట్ల నుండి వినియోగదారుల వద్దకు చేర్చేందుకు రవాణా చార్జీలు ఖరారు చేయాలనీ రవాణా శాఖాధికారులను ఆదేశించారు. డీస్లిటేషన్ పాయింట్,స్టాక్ పాయింట్ల వద్ద సిసి కెమెరాలతో పటిష్టమైన నిఘా పెట్టి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్టాక్ పాయింట్ నుండి వినియోగదారులకు సరఫరాకు వినియోగించే వాహనాలకు తప్పనిసరిగా జిపిఎస్ విధానం ఉండాలని,వాహనాల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. వేసవి దృష్ట్యా గోదావరి నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉంది ఇసుక లభ్యత ఎక్కువగా ఉంటుందని, జిల్లాలో రాబోయే వర్షాకాలం సీజన్లో ఇసుక అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందుకు అనుగుణంగా స్టాక్ పాయింట్ల వద్ద ఇసుకను నిల్వ చేయాలన్నారు.సమావేశంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఉపరవాణా కమీషనర్ షేక్ కరీం, ఆర్టీఓలు కృష్ణారావు, మదానీ,గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.రవికుమార్,ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ త్రినాధ్ బాబు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆంధ్రజ్యోతి బ్యూరో రాజుకు పితృవియోగం

## : పరామర్శించిన ఎమ్మెల్యే బడేటి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆంధ్రజ్యోతి దినపత్రిక బ్యూరో ఇన్‌ఛార్జ్ జీవిఎస్ఎన్ రాజు తండ్రి గొట్టుముక్కల సీతారామరాజు (96) అనారోగ్య కారణాలతో ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని శనివారపు పేటలోని స్వగృహానికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బడేటి చంటి అక్కడకు వెళ్ళి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. జీవిఎస్ఎన్ రాజు,ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి,ధైర్యంగా ఉండాలని సూచించారు. పలువురు పాత్రికేయులు కూడా మృతదేహాన్ని సందర్శించి,సీతారామరాజుకు ఘన నివాళులు అర్పించారు.

# ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థికి ఎంపీ మహేష్ అభినందనలు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థిని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందించారు. జంగారెడ్డిగూడెం తపస్ కళాశాలకు చెందిన విద్యార్థి కె.జైత్ర ఎంపీసీలో 464 మార్కులు సాధించి తన ప్రతిభను చాటాడు.కళాశాల యాజమాన్యంతో కలిసి విద్యార్థి జైత్ర బుధవారం ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు.అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థి జైత్రను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందించి,శాలువా కప్పి సన్మానించారు. భవిష్యత్తులో మరింత ఉన్నతికి చేరుకోవాలని ఎంపీ సూచించారు.

# మ్యూజిక్ ప్రదర్శనలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన విక్టర్



**ఏలూరు,మేజర్ న్యూస్ :** మ్యూజిక్ ముద్దుబిడ్డలు పోలగాని విక్టర్ (రాంబాబు)తమ అత్యుత్తమ మ్యూజిక్ ప్రదర్శించి భవిష్యత్తులో మరెన్నో ప్రపంచ రికార్డులు అందుకోవాలని పలువురు సంగీత అభిమానులు కోరారు. గత ఏడాది డిసెంబర్ 1వ తేదీన హలేల్ సంగీత పాఠశాల ద్వారా ప్రపంచ స్థాయిలో జరిగిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ మ్యూజిక్ ప్రదర్శనలో తన మ్యూజిక్ ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరచి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం దక్కించుకున్నారు. ఏలూరు ఎన్‌టిఆర్ కాలనీకి ప్రాంతానికి చెందిన పాస్టర్. పోలగాని విక్టర్ ఆన్లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో పాల్గొన్న 1046 మంది విద్యార్థులు గంట సమయంలో కీబోర్డు వాయించి తమ ప్రతిభను కనబరచుకొని గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకున్నారు. ప్రపంచ రికార్డు నెలకొల్పి ఈ బృందంలో వీరి మ్యూజిక్‌ని గుర్తించిన వరల్డ్ రికార్డు ప్రతినిధులు ఆనంద్ రాజన్,హల్లేలు మ్యూజిక్ పాఠశాల వ్యవస్థాపకుడు అగస్టీన్ దండంగిలు వీరిరు వురికి సర్టిఫికేట్లతోపాటు గోల్డ్ మెడల్స్ అందించారు. ఈ ఘనత సాధించిన పాస్టర్.పి.విక్టర్‌ని, వారి కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు,శ్రేయోభిలాషులు, తదితరులు అభినందించి భవిష్యత్తులో అత్యుత్తమ మ్యూజిక్కు ప్రదర్శించి ఇలాంటి ప్రపంచ రికార్డులు మరిన్ని పొందాలని కోరారు.